క్లుప్తంగా

మధ్యాహ్న భోజనంపై ఎంఈవో విచారణ



విచారణ చేస్తున్న ఎంఈవో బ్రహ్మాజి

రావికమతం: టి.అర్జాపురం హైస్కూల్‌లో సోమవారం ఉడకని అన్నం పెట్టడంతో విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లిపోయిన సంఘటనపై ఎంఈవో ఎస్. బ్రహ్మాజి మంగళవారం విచారణ చేశారు. ఇక్కడ పలువురు విద్యార్థులను విడివిడిగానూ, బహిరంగంగా విచారించారు. ఆపై భోజన నిర్వాహకురాలు పడాల దేవిని ప్రశ్నించగా, ఇకపై ఇటువంటి పొరపాటు రాదని సమాధానమివ్వగా, మళ్లీ పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆమెను పలుమార్లు విచారణ చేసిన అధికారులు మందలించినా తీరు మార్చుకోవడం లేదని కఠిన చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ మత్స భవానీప్రసాద్ డిమాండ్ చేశారు.

వేణుగోపాల స్వామివారి విగ్రహ ప్రతిష్ట రేపు

రోలుగుంట: వడ్డిపలో ఈ నెల 22న వేణుగోపాల స్వామివారి విగ్రహ ప్రతిష్ఠోత్సవం నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, పతాక ప్రతిష్ట హోమం చేస్తారు. సాయంత్రం స్వామివారి తిరువీధి నిర్వహిస్తారు. గురువారం గర్భాలయ వాస్తు పూజ చేసి, యంత్ర ప్రతిష్ట అనంతరం విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తామని, భక్తులు అధికంగా పాల్గొనాలని కమిటీ విజ్ఞప్తి చేశారు.

గొల్లలపాలెంలో అన్నసమారాధన

రావికమతం: మరుపాక శివారు గొల్లలపాలెం గ్రామంలో మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా ఇక్కడ భక్తాంజనేయ స్వామివారి ఆలయంలో గ్రామస్తులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గ్రామస్తులు ముమ్మల రామకృష్ణ, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఏకాహం

మాడుగుల రూరల్: ఏకాదశి పర్వదినం సందర్భంగా కె.జె.పురం రామాలయంలో ఏకాహం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని భజన బృంద భక్తులు చేపట్టారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ జరిగింది.

నల్లమారమ్మ జాతరకు ఏర్పాట్లు



గరగలను ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీ

మాకవరపాలెం: కొండల అగ్రహారంలో నల్లమారమ్మతల్లి జాతరకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా మాదిరిగానే గురువారం ఇక్కడ వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా మంగళవారం అమ్మవారి గరగలను ఆలయం వద్ద నుంచి గ్రామంలోని అన్ని వీధుల్లోనూ ఊరేగించారు. జాతర రోజు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ ధర్మకర్త గూడూరు వెంకటరాజు తెలిపారు. గరగల ఊరేగింపులో వైఎస్సార్‌సీపీ నాయకులు చిటికెల రమణ, పోలిరెడ్డి రమణ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించేందుకు కృషి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో

మాకవరపాలెం: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి సూచించారు. గిడుతూరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యా బోధనలో మెలకువలపై ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు విద్యాప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బాబ్జీరావు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



గొలుగొండలో వలంటీర్లకు సన్మానం చేస్తున్న దృశ్యం



కె.కోటపాడు: వలంటీర్లను సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: వలంటీర్ వ్యవస్థను అమలు చేసేందుకు ఇతర రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయని, ఇది మన ప్రభుత్వ పనితీరుకు నిదర్శమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. వలంటీర్ల వందనం కార్యక్రమంలో భాగంగా సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను పొందిన వలంటీర్లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన సన్మానించారు. ప్రభుత్వం ప్రకటించిన అవార్డులతో మరింత బాధ్యత వలంటీర్లపై పెరిగిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవడంతోపాటు గ్రామాల్లో సంక్షేమాన్ని సకాలంలో వర్తింపజేసి, వారి అభిమానాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఎంపీడీవో అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి వి.ప్రసాద్, సర్పంచ్‌లు బండారు ముత్యాలనాయుడు, చీపురపలి అచ్చిబాబు, వంటాకు అప్పాజీ, గొర్రుపోటు వెంకటరావు, పైల అమ్మాజీ, బండారు దేముళ్లు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

దేవరాపల్లి: ప్రతి ఇంటి తలుపు తట్టి సంక్షేమ పథకాలను అందజేస్తున్న వలంటీర్ల వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందని గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, సర్పంచ్ దాడి జగన్ అన్నారు. వలంటీర్ల వందనం కార్యక్రమంలో భాగంగా ఎం. అలమండలో స్థానిక ఎంపీటీసీ పోతల వెంకటరావుతో కలిసి మంగళవారం ఆయన వలంటీర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతల లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జైతవరంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

బుచ్చెయ్యపేట: అధికారంలోకి వస్తే వలంటీర్లను తొలగిస్తామన్న తెలుగుదేశం పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని జెడ్పీటీసీ దొండా రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం దిబ్బిడి, బుచ్చెయ్యపేట, కె.పి.అగ్రహారం, కందిపూడి, పి.భీమవరం గ్రామాల వలంటీర్లకు బుచ్చెయ్యపేటలో సేవా రత్న, మిత్ర అవార్డులను ప్రదానం చేశారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇళ్లకు చేర్చుతున్న వలంటీర్లను టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తొలగిస్తామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీ లలితా నారాయణమూర్తి, కోఆపరేటివ్ అధ్యక్షుడు సుంకరి శ్రీను, సర్పంచ్‌లు, నాయకులు గోపిశెట్టి శ్రీను, పాతాళ సత్తిబాబు, సుంకరి లక్ష్మి, కోరుకొండ అప్పలనాయుడు, కోవెల ఈశ్వరరావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొలుగొండ: వలంటీర్ల వందనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పప్పుశెట్టిపాలెం, గొలుగొండ, పాతమల్లంపేట గ్రామ పంచాయతీల్లో వలంటీర్లను పురస్కారాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, పార్టీ యూత్ విభాగం మండలాధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో పేదలకు అన్ని పథకాల పంపిణీలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని, వారికి సన్మానం చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కసిపల్లి బుజ్జి, మాకిరెడ్డి విజయలక్ష్మి, పంచాయతీ, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో 363 మంది వలంటీర్లకు ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ మంగళవారం ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. సేవా రత్నకు ఎల్.పొన్నవోలుకు చెందిన వంతల నాగేశ్వరి, మాడుగుల సచివాలయం-2, 3కు చెందిన బీరా మేరి, కోరసాల శివసత్య, ఎం. కోడూరుకు చెందిన సుంకరి వెంకటలక్ష్మి, సత్యవరానికి చెందిన చల్లా లీలావతి ఎంపికయ్యారు. ఎంపీడీవో ఆర్. కాశీప్రసాదు, సర్పంచ్ యడ్ల కళావతి, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, ఈవోపీఆర్డీ మీనాకుమారి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీడికాడ: జైతవరంలో వలంటీర్లను ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు లాలం శారద మంగళవారం ఘనంగా సన్మానించారు. ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. సర్పంచ్ కోడూరు సత్యవతి, ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఎం.అలమండలో వలంటీర్లను సత్కరిస్తున్న సర్పంచ్ దాడి జగన్



బుచ్చెయ్యపేటలో వలంటీర్లను సత్కరిస్తున్న నాయకులు



వలంటీర్లను ప్రశంసాపత్రంతో సత్కరిస్తున్న ఎంపీపీ రాజారామ్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేశారు. అమలాపురానికి చెందిన బొట్టా కృష్ణలావణ్యకు రూ.4 లక్షలు, చెట్టుపల్లికి చెందిన గవిరెడ్డి వెంకటలక్ష్మికి రూ.లక్ష, కుమారికి రూ.27 వేలు, దుగ్గాడకు చెందిన నల్లబెల్లి సత్యవతికి రూ.20 వేలు, మొత్తం రూ.5.47 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైంది. ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ సంజీవినీలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల యూత్ నాయకులు దన్నిన నానాజీ, ఎంఎల్‌వో సుర్ల శేఖర్, సర్పంచ్ శెట్టి అచ్చిరాజు, పార్టీ నాయకులు ఇన్నం రమణ, రాజారావు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలు



మాట్లాడుతున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు

నర్సీపట్నం: న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ వివిధ కేసుల్లో ఇబ్బంది పడుతున్న వారు న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమతలేని వారందరికీ ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

రూ.1.20 కోట్లతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్

- 3 పంచాయతీలకు ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు
- నాతవరం విద్యుత్ శాఖ జేఈ చంద్రమౌళి



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు పనులు చేస్తున్న సిబ్బంది

నాతవరం: మండలంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం రూ.1.20 కోట్లతో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసిందని నాతవరం విద్యుత్ శాఖ జేఈ ఎస్.చంద్రమౌళి తెలిపారు. ఈ నిధులతో స్థానిక సబ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీంతోపాటు లోవోల్టేజీ సమస్య ఉన్న వెదురుపల్లి, చమ్మచింత, గునుపూడి పంచాయతీల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయన్నారు. వాటిని త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. వేసవిలో కరెంటు కోతలు లేకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. నాతవరం, చినగొలుగొండపేట, గన్నవరం ప్రాంతాల్లో విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో కలెక్షన్లు 18,450పైగా ఉన్నాయని, వాటిలో 856 వ్యవసాయ మోటార్లు కనెక్షన్లు ఉన్నాయన్నారు. వ్యవసాయానికి రోజుకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా 9 గంటలు, గృహ సముదాయాలకు త్రీఫేస్ 24 గంటలపాటు ఇస్తున్నామన్నారు. వీటికి వేర్వేరుగా విద్యుత్ సరఫరా అందించేందుకు కొత్తగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా పనులు సకాలంలో పూర్తయితే విద్యుత్ సమస్య ఉండదన్నారు.

గవరవరంలో పశువుల పాక దగ్ధం

- రూ.25 వేల ఆస్తి నష్టం



ప్రమాదంలో కాలిపోయిన పశువులపాక, గడ్డివాము

చోడవరం రూరల్: గవరవరంలో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో పశువుల పాక, రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. రూ. 25 వేల ఆస్తి నష్టం వాటిల్లింది. గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి పారేసిన సిగరెట్ పీక కారణంగా సాయంత్రం పాకలకు నిప్పంటుకుని మంటలు రేగాయి. ఈ మంటల్లో దువ్వూరి శ్రీనివాస్‌కు చెందిన వరి గడ్డివాము, చప్పగడ్డి రామునాయుడుకు చెందిన పశువుల పాక, గడ్డివాము కాలిపోయాయి. చోడవరం అగ్నిమాపక దళాధికారి రామస్వామి తమ సిబ్బందితో ప్రమాదస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

కోట్లాది రూపాయలతో అడుగడుగునా అభివృద్ధి

మండల సర్వసభ్య సమావేశంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



డిప్యూటీ సీఎం బూడిని సన్మానిస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్‌లు

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ పాలనలో మాడుగుల నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అడుగడుగునా అభివృద్ధి చేశామని, ప్రజలకు సంక్షేమ లబ్ధి కలిగిందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అధ్యక్షతన మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గంలో రూ.178 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటి కుళాయిల ఏర్పాటుతోపాటు అవసరమైన చోట మంచినీటి ట్యాంకులు నిర్మిస్తున్నామన్నారు. పాత రోడ్లకు మరమ్మతులతోపాటు అంతర్గత మట్టిరోడ్లను తారురోడ్లుగా మార్చామన్నారు. కె.కోటపాడు మండలంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమం చేసినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాల తీర్మానం చేశారు. ఇంకా కొద్దిపాటిగా మిలిగిన అభివృద్ధి వచ్చే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తి చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో అప్పలరాజు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, ఎంపీటీసీలు ఏటుకూరి రాజేష్, వర్రి వెంకటరావు, కోటాన అశోక్, నెక్కల గోపి, లెక్కల గౌతమి, గొర్రుపోటు రామలక్ష్మి, వంటాకు నారాయణమ్మ, వేచలపు దొరబాబు పాల్గొన్నారు.

వైభవంగా రుద్రహోమం

మాకవరపాలెం: స్థానిక పెద్దమిల్లు జంక్షన్‌లోని వామ లింగేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం వైభవంగా జరిగింది. మంగళవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలో రుద్ర హోమం, లక్ష్మీ గణపతి హోమం, మృత్యుంజయ హోమం, నవగ్రహ హోమంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో తాగునీటి బోర్లు ఏర్పాటు



మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా రూ.20 లక్షలతో 15 బోర్లు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలు ఉన్నాయన్నారు. ప్రధానంగా ఈ నిధులతో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఆమోదంతో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సూచన మేరకు పనులు చేస్తున్నామన్నారు. మిగతా నిధులతో పారిశుద్ధ్య పనులు చేస్తామన్నారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. వీటితోపాటు జల్ జీవన్ మిషన్‌లో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, సీనియర్ అసిస్టెంటు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవాడ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతికి మారు పేరు టీడీపీ నాయకులే

- ఎమ్మెల్యేను విమర్శిస్తే తగిన గుణపాఠం చెబుతాం
- వైఎస్సార్‌సీపీ నాయకుల హెచ్చరిక



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చెయ్యపేట: అవినీతి అంటేనే టీడీపీ నాయకులని, తమ ఎమ్మెల్యే, విప్ కరణం ధర్మశ్రీని విమర్శిస్తే తగిన గుణపాఠం చెబుతామని డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైఎస్సార్‌సీపీ వడ్డాది టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి హెచ్చరించారు. మంగళవారం వడ్డాదిలో వీరు మాట్లాడుతూ వడ్డాది శంఖారావం సభలో విప్ ధర్మశ్రీని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, జనసేన పార్టీ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు వ్యక్తిగతంగా విమర్శించడంపై మండిపడ్డారు. రాజకీయంగా దెబ్బతీయాలని, లేనిపోని వ్యక్తిగత దూషణలు చేయడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ అభివృద్ధి పనులు చేస్తున్న తమ నాయకుడిపై ఆరోపణలు తగదన్నారు. గత టీడీపీ హయాంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ నిధులు మింగేసి రూ.78 కోట్ల నష్టాలు తెచ్చిపెట్టారని దుయ్యబట్టారు. ఇసుక, నీరు- చెట్టు, సీసీరోడ్లు, ఇతర పథకాల్లో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిన టీడీపీ నాయకులు జేబులు నింపుకుని స్టేజీలపై శ్రీరంగ నీతులు వల్లించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గురివింద గింజ చందంగా వారు చేసిన అవినీతి గురించి ముందు తెలుసుకోవాలని హితవు పలికారు. ఎంపీటీసీలు ఇంటి అప్పారావు, కోరుకొండ లీలావతి రమణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చింతల శంకర్రావు, నాయకులు అయ్యన్నదొర, బొబ్బరి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన



రావికమతం: వైద్యం చేస్తున్న ప్రత్యేక వైద్య నిపుణులు స్మృతి



దేవరాపల్లి: మారేపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి పూజ్య మేఘన



మాడుగుల రూరల్: కె. వల్లాపురంలో మందులు పరిశీలిస్తున్న ఎంపీపీ రాజారామ్



చోడవరం: రోగులకు ఆరోగ్య కిట్లు అందజేస్తున్న గ్రామ ప్రజాప్రతినిధులు

చోడవరం: జగన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. నేరుగా గ్రామాలకే వైద్య బృందం వచ్చి పరీక్షించి మందులు అందించడంతో ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం ఖండిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ భారతి ఆధ్వర్యంలో ఐదుగురు వైద్యుల బృందం 315 మందిని పరీక్షించింది. రోగులకు ఇబ్బంది లేకుండా సర్పంచ్ శానాపతి రాజశేఖర్, కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు శానాపతి సత్యారావు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి జి. విష్ణు, మెడికల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కింతలి వల్లాపురంలో 360 మందికి వైద్య సేవలు

మాడుగుల రూరల్: కింతలి వల్లాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి ప్రారంభించారు. కింతలి వల్లాపురం, కింతలి, తదితర గ్రామాలకు చెందిన 360 మందికి వైద్య సేవలందించారు. కింతలి పీహెచ్‌సీ వైద్యులు కె.ఎం.నాయుడు, డాక్టర్ బొడ్డేడ రవితేజ, నరేష్, ఆప్తాలమిస్టు సహాయకురాలు పల్లెల నాగలక్ష్మి, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా ఆరుగురికి కళ్లద్దాలను ఎంపీపీ పంపిణీ చేశారు.

వడ్డాదిలో 356 మందికి..

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజర్ పంచాయతీలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష -2 శిబిరంలో 356 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. వైద్యులు మౌనిక, వినయ్ కుమార్, శ్రీనివాస్, ఉమామహేష్, తమ సిబ్బందితో వడ్డాది, కొత్తూరు, ఎస్సీ కాలనీ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. వీరిలో ఇద్దరికి తీవ్ర అనారోగ్య సమస్యలున్నట్లు గుర్తించి మెరుగైన వైద్య సేవలకు ఎంపిక చేశారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీటీసీ కోరుకొండ లీలావతి రమణ, ఈవో లవరాజు పాల్గొన్నారు.

చీమలపాడులో 426 మందికి..

రావికమతం: జగనన్న ఆరోగ్య సురక్ష -2 శిబిరాన్ని మంగళవారం చీమలపాడులో నిర్వహించారు. చోడవరం సీహెచ్‌సీ గైనిక్ వైద్యనిపుణులు స్మృతి, ఎండీ మల్లికార్జునరావు, కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి సురేఖ 426 మంది రోగులను పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ వంజరి గంగరాజు , కొత్తకోట పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు పాల్గొన్నారు.

మారేపల్లిలో 390 మందికి..

దేవరాపల్లి: మారేపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ అవుగడ్డ కన్నతల్లి, ఎంపీటీసీ అవుగడ్డ రమాదేవి మంగళవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ. పూజ్య మేఘన, గైనకాలజిస్టు టి. కల్యాణి, చిన్నపిల్లల వైద్యాధికారి జె. వాసవి 390 మందిని పరీక్షించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఆప్తాలమిస్టు నవీన 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

వైభవంగా ఉమామహేశ్వరి దేవి కల్యాణ మహోత్సవం

దేవరాపల్లి: ఉమామహేశ్వరి దేవి కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి దేవరాపల్లిలో వైభవంగా జరిగింది. అమ్మవారి కల్యాణ, తీర్థ మహోత్సవాల్లో భాగంగా తొలి రోజు భక్తులు పాల్గొని కనులారా వీక్షించి తరించారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు దంపతులు తెల్లవారు జామున దర్శించుకొని పూజలు చేశారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వి. సింహాచలం నాయుడు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, సబ్బవరపు మాలిబాబు, దీవి శంకర్, ఇట్లా వెంకటపతి, గుల్లేపల్లి మురళీ, తోట అచ్చిబాబు పాల్గొన్నారు.

90 లీటర్ల సారా పట్టివేత

బుచ్చెయ్యపేట: నీలకంఠాపురంలో 90 లీటర్ల సారా ను పట్టుకున్నట్లు ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. మంగళవారం రాత్రి తమ సిబ్బందితో గ్రామంలో సోదాలు చేయగా యన్నెంశెట్టి చెల్లంనాయుడు సారా అమ్ముతుండగా పట్టుకున్నామన్నారు. అతని వద్ద రెండు క్యాన్‌ల్లో సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దిబ్బిడిలో కోడిపందాలు ఆడుతున్న వారిపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఐదుగురుని అదుపులోకి తీసుకుని కోడి పుంజును రూ.10,220 స్వాధీనం చేసుకున్నామన్నారు.

వేడుకగా కేశవస్వామి బ్రహ్మోత్సవాలు

చోడవరం: గోవింద నామస్మరణతో చోడవరం పట్టణం మారుమోగింది. కోలాట నృత్యాలు, చిటికెల భజనలతో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్తరాంధ్రలో ప్రాచీన దేవాలయాల్లో ఒకటైన చోడవరం కేశవస్వామివారి 751వ వార్షిక బ్రహ్మోత్సవాలు వారం రోజులపాటు జరగనున్నాయి. భీష్మ ఏకాదశి పర్వదినం కావడంతో శ్రీదేవి, భూదేవి సమేతుడైన కేశవ స్వామివారికి అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉత్సవ మూర్తులను ఉంచి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు కోలాట భజన బృందాలు కోలాటం ప్రదర్శన చేసింది. ఉత్సవంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అలమండల ఈశ్వరరావు, దేవదాయ



కోలాట నృత్యం వేస్తున్న టీటీడీ దాస సాహిత్య కేంద్రం మహిళల బృందం